# రెక్కలొచ్చిన పక్షి

## శ్రీ వి. సంపత్కుమారాచార్య.

"శంకరంగారూ!... మీకో ఉత్తరం"

ఆత్రుతగా అందుకున్నాడు పోస్ట్‌మేన్ శంకరం ఎదురుకుండా ఉత్తరాలు సార్ట్ చేస్తూన్న మరో పోస్ట్‌మేన్‌నించి. కవరుమీద అడ్రసు రాసిన దస్తూరిని చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయింది. త్వరత్వరంగా తన బీటుకి సంబంధించిన ఉత్తరాలనీ, పార్సిల్స్‌నీ సర్దుకున్నాడు. ఆనందంగా పోస్టాఫీసు బయటకువచ్చి కవరువిప్పి ఉత్తరం చదువుకున్నాడు. మొహంలో వున్న ఆనంద చిహ్నాలన్నీ ఒక్కొక్కటే మాయమయ్యాయి.

"అంతేరా...కనీ...పెంచి పెద్దచేసి, చదివించీ...నీ మీద ఆశల్ని పెంచుకున్న నీ తల్లిదండ్రులకి నువ్వు చెయ్యవలిసిన సేవ యింతేరా... మాకు తగిన బుద్ధే చెప్పావు..."

అనుకుంటూ నిరాశగా సైకిలెక్కి తన బీటుకి బయల్దేరాడు ఉత్తరాలివ్వడానికి.

శంకరం ఉత్తరాలివ్వవలసిన బీటులోనే అతని ఇల్లు ఉంది. ఇంటిముందు ఆపాడు. లోపలికి వెళ్ళి భార్యను పిలిచి కాసిని మంచి నీళ్ళిమ్మని అడిగాడు. నీళ్ళందిస్తున్న భార్య కళ్ళల్లో ఆతృత కనిపెట్టి.

"ఇదిగో రాసేడే నీ ముద్దుల కొడుకు; రోజూ ఎదురు చూస్తున్నావుగా ఉత్తరం కోసం?... చదువుతా విను...

"ప్రియమైన నాన్నగారికి...

నేను మీ కెవరికీ చెప్పకుండా వెళ్ళిపోయానని కోపం వచ్చి ఉంటుంది. ఈ మూడు నెలలుగా ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నాను. ఇంతవరకూ దొరకలేదు. అలాగని నేనేదో డబ్బుకోసం రాస్తున్నానని అనుకోవద్దు. మీరు అప్పో సప్పో చేసి పంపిస్తారని నాకు తెలుసు కాబట్టే నా అడ్రసు కూడా ఇవ్వడంలేదు. మన కష్టాలు తీర్చగలిగే స్తోమత కలిగేవరకూ... అక్కయ్యల పెళ్ళికి అయిన అప్పు తీర్చగలిగే తాహతు కలిగేవరకూ మీకు నా ముఖం చూపించదల్చుకోలేదు. ఎక్కడున్నా నేను క్షేమంగానే ఉంటాను, నా కోసం ఆందోళన వద్దు, అమ్మకి ధైర్యం చెప్పండి."

మీ

గోపి.

"విన్నావుగా.. వీడు దేశాలు పట్టి వెళ్ళినందుకు ఏడవడమా... ఏ అడ్రసూ కూడా రాయకుండా ఇన్నాళ్ళకి ఓ ఉత్తరం రాసి పడేసినందుకు సంతోషించడమా?... చూడు...లోకంలో ఎంతమంది ఉన్నారో.. అందరి కొడుకులూ ఇట్లాగే ఉన్నారా? వాడికి మన దరిద్రపు కొంపలో జీవితం నచ్చలేదు. హాయిగా రెక్కలాడించుకుంటూ వెళ్ళిపోయాడు. వాడికేం యువకుడు. సుఖంగా కాలం గడుపుతాడు. ముసలివాళ్ళజోలి వాడికెందుకు? పైగా మనల్ని ఉద్ధరించేందుకే వెళ్ళిపోయాట్ట..."

అంటూ అసలే కుమిలిపోతూన్న భార్యకేసి చూడలేక చూస్తూ సైకిలెక్కాడు శంకరం.

మనస్సంతా ఆందోళన నిండగా అలాగే యాంత్రికంగా ఉత్తరాలిస్తూ ఇంటింటికీ వెడుతున్నాడు.

సందు చివర ముసలావిడ పంపుదగ్గిర నీళ్ళు పట్టుకుంటున్నదల్లా శంకరాన్ని చూడగానే ఆతృతగా ఎదురువచ్చి ప్రశ్నించింది,

"బాబూ... యివాళైనా మా వాడిదగ్గిర్నించి డబ్బేమైనా వచ్చిందా? కనీసం ఓ ఉత్తరమ్ముక్క అయినా...??"

అలవాటుగా లేదని చెప్పబోయి ఆమె నడిగాడు, "ఏమమ్మా? మీ అబ్బాయిగారికి ఢిల్లీలో ఏం ఉద్యోగం ?"

"ఏదో పెద్ద ఉద్యోగమేబాబూ. దానిపేరు చెప్పడానికి నాకు నోరు తిరగదు. ఏం లాభం నాయనా?...తెలిసినవాడివి కాబట్టి నీతో చెప్తున్నాను. ఉద్యోగంలో ప్రవేశించి ఆర్నెల్లయిందా?—ఇంతవరకూ పైసాపంపలేదు. వెడ్తూనే పెళ్ళాన్ని తీస్కువెళ్ళాడు. వాళ్ళ షికార్లకీ...సినీమాలకే చాలదు నాయనా...ఈ ముసలిముండని గుర్తుంచుకునే తీరికా ఓపికా వాళ్ళకేది బాబూ?...ఇంతకీ ఏమీ రానట్టేగా??" అంటూ వెళ్ళిపోయింది నీళ్ళు నిండిన కళ్ళు తుడుచుకుంటూ.

"పోస్ట్‌మేన్‌గారండీ... మా అన్నయ్య దగ్గిర్నించి ఉత్తరం వచ్చిందాండీ?"

ఆలోచిస్తూ ముసలావిడకేసే చూస్తూన్న శంకరం వెనుతిరిగి చూసేడు.

పదేళ్ళపిల్ల చేతిలో ఉత్తరాలకేసి ఆశగాచూస్తూ అడుగుతోంది. ఆ పిల్ల రోజూ ఇల్లాగే అడుగుతుంది. తను లేదనిచెప్తాడు. ఇవాళ కూడా అదే జవాబు ఎదురవడంతో ఆ పిల్ల దిక్కుమొహం వేసుకుని వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి రిటైర్డ్ సెకండరీ గ్రేడు టీచరు వెంకట్రావుగారి నలుగో కూతురు. ఆయన నానా బాధలూపడి ముగ్గురు

కూతుళ్ళ పెళ్ళి చేసేడు. పెద్దకొడుకు ఏదో ఉద్యోగంచేస్తూ హఠాత్తుగా ఏక్సిడెంటులో చనిపోయాడు. చిన్నకొడుకు హైదరాబాదులో ఉన్నాడు. వాళ్ళనీ వీళ్ళనీ బ్రతిమాలి తండ్రి ఉద్యోగంవేయిస్తే ఆ తండ్రికే అన్ని బాధ్యతలూ వదిలిపెట్టి హాయిగా ఆ పట్నంలో కులుకుతున్నాడు. పైపెచ్చు తన అవసరాలకి అడపా దడపా డబ్బు కోసం ఉత్తరం రాస్తాడేకాని, మిగిలిన సమయాల్లో క్షేమ సమాచారం కూడా తెలపడు. పాపం...ఈ పసిపిల్లకేం తెలుసు? అన్నయ్య ఏదో పంపిస్తాడు...పుస్తకాలు...రిబ్బన్లు...స్కూలు సంచీ...పెన్నూ... అన్నీ కొనేసుకోవచ్చునని ఆశగా రోజూ ఎదురుచూస్తుంటుంది...

మరో యింటి కిటికీలోంచి మెరిసే కళ్ళు ఆశగా తన చేతిలో ఉత్తరాలవేపు చూస్తున్నాయి. మౌనంగా సైకిలెక్కగానే కిటికీ రెక్కలు నిరాశగా మూతబడ్డాయి...

"ప్రపంచంలో ఎన్ని సమస్యలు!... ప్రతి యింట్లోనూ ఏదో సమస్య... ప్రతి మనిషికీ ఏదో ఆవేదన... తన చేతినిండా వున్న ఇన్ని ఉత్తరాల్లో ఎన్ని జీవితాల ప్రశ్నలకి జవాబులున్నాయో!... ఎన్ని శుభవార్తలు...... ఎన్ని విషాద వార్తలున్నాయో ! ... మూణ్ణెల్ల క్రితం తనకు చెప్పకుండా వెళ్ళిపోయిన తన కొడుకు క్షేమ వార్తకోసం తానెదురుచూసినట్లే ఎందరో ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతూ... తాను వీధిలో కనుపించగానే చేస్తూన్న పనులు వదిలేసి ఎదురు వస్తారు. ఉత్తరాల్లేవని చెప్పగానే చిన్నబోయి లోపలికి వెళ్ళిపోతారు."

అనుకుంటూ శంకరం ప్రక్క సందులోకి తిరిగాడు.

ఎదురుకుండా స్టేట్ బ్యాంక్ ఏజెంటుగారు కనపడ్డారు.

"సార్!... మీకో ఉత్తరం సార్! ...మీరే ఎదురు పడ్డారు. ఇదిగో..."

అంటూ కవరిచ్చి సాగిపోయాడు.

"ఇదిగో శంకరం ... మాట" అని వెనక్కి పిలిచిన ఏజెంటుగారి దగ్గిరికి మళ్ళీ వెళ్ళాడు.

"ఏజెంటుగారికి ఏభై రూపాయలు యివ్వాలి. ఆ విషయం అడుగుతారేమో" అనుకుంటూ ఆయనకేసి చూసేడు.

"మీవాడూ మా వాడూ ఒకేరోజున కదోయ్ వెళ్ళిపోలా? మా వాడు రాసేడు. బెంగుళూరులో ఉన్నాట్ట. చదువుతా విను...డియర్ ఫాదర్... నేను ప్రస్తుతం బెంగుళూరులో ఉన్నాను. సమ్మర్‌లో కూడా చల్లగా హాయిగా ఉందిక్కడ. మీకు చెప్పకుండా వెళ్ళిపోయానని బాధ పడద్దు. మీరు బీరువాలో దాచిన మూడు వేలూ తీసుకు పోయానని కోపం వచ్చి ఉంటుంది. కాని ఏంచెయ్యను?...ఆ ఊళ్ళో నాకు రాని షేక్‌హాండ్ నేర్చుకోడంకన్నా సన్నాగా నాలుగూళ్ళు తిరిగి అనుభవం సంపాదిస్తున్నాను. తెచ్చిన డబ్బు అయిపోయింది. కాబట్టి మీరు కోపగించుకోక వెయ్యిరూపాయలు పంపించండి. అడ్రసు పైన రాసేను. ఇంకొన్నాళ్ళు ఇక్కడే గడిపి వస్తాను. మీకు స్వంతం నేను కాక మరెవ్వరున్నారు గనుక?... ప్లీజ్... వెంటనే పంపిస్తారు కదూ?–"

"చూడవయ్యా చూడు... ఎలా రాసేడో... పుత్రుడయ్యా పుత్రుడు. పున్నామ నరకం నించి రక్షింపటం అలా ఉంచి ఇక్కడే నరకం సృష్టిస్తున్నాడు. వీడి దురలవాట్లకి ఇక్కడుంటే సాగదని ఇలా చంపుతున్నాడు. ఇప్పుడేం చెయ్యడం?... పంపితే అవి స్వాహా చేసి మళ్ళీ రాస్తాడు. పంపకపోతే అసలుకే పలా ఉండదు. చూసేనా ఈ డిమాండు?... వీడు నాకో సమస్యగా తయారయ్యాడు. అన్నట్టు మీవాడెక్కడున్నాట్ట? ఏమన్నా రాసేడా?"

అంటూన్న ఏజెంటుగారికి రాసేడన్నట్టు తల ఊపి, వెంటనే వేగంగా ఇల్లు చేరాడు శంకరం వెయ్యేనుగుల బలంతో.

గోడకి తగిలించి ఉన్న కొడుకు ఫొటోకేసి ప్రేమగా చూసేడు.

భార్య వంటింట్లో కూర్చుని సన్నగా ఏడుస్తోంది.

జేబులోని ఉత్తరాన్ని మరో మారు చదువుకున్నాడు...

"ఏమే యిలా రావే...ఎందుకే ఏడుస్తావు?...

నీ కొడుకంటే ఎవరే!.. రత్నమేవాడు...రత్నం...వాడు కృతఘ్నుడు కాదే...రెక్కలొచ్చిన పక్షికి తల్లి తెచ్చే గింజమీద ఆశ ఉండదే అది తల్లిని పీడించుకు తినదే తిండికోసం. తానే సంపాదించి పెడుతుందే. చూస్తూండు...మనవాడు పట్టుదలగా ఉద్యోగం సంపాదించి మన కష్టాల్ని తీరుస్తాడే!.. యువనోద్రేకంలో పెద్దలని అలక్ష్యంచేసే యువకులూ...తన కాళ్ళమీద నిలబడే శక్తినిచ్చిన తల్లిదండ్రులనే ఇంకా పీడించుకుతినే కొడుకులూ...దురభ్యాసాలలో కళ్ళుమూసుకు పోయి పెద్దలకే సమస్యగా తయారైన వెధవలూ నిండిన ఈ లోకంలో గోపీలాంటి కొడుకుని కన్నందుకు గర్వించాలె మనం. మన బాధల్ని చూడలేక వెళ్ళాడేవాడు. మనల్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తాడు. పచ్చెం బాధపడద్దు. వాడి క్షేమసమాచారం తెలిసాడు అంతేచాలు. సంతోషించు..."

అంటూ భార్యకన్నీళ్ళు తుడిచి, మిగిలిన ఉత్తరాల నివ్వడానికి మళ్ళీ సైకిలెక్కాడు శంకరం.